# ప్రమాదరహిత రోడ్లు

## హైదరాబాద్ ఔటర్ చుట్టూ 330 కి.మీ. ప్రాంతీయ రింగురోడ్డు



- అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలి
- యావత్ దేశానికి ఆదర్శంగా విజన్ డాక్యుమెంట్
- అన్నిజిల్లాలకు జాతీయ హైవేలతో కనెక్టివిటీ
- ఆర్అండ్‌బీ సమీక్షలో సీఎం కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ప్రమాదరహిత ప్రయాణమే లక్ష్యంగా రాష్ట్ర రహదారులను అంతర్జాతీయస్థాయి నాణ్యతాప్రమాణాలతో తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో రహదారుల ప్రస్తుత పరిస్థితిని పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి, రాబోయే పదేండ్లకోసం తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కోరారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఆర్అండ్‌బీ అధికారులతో సమావేశమైన సీఎం.. ఆ శాఖ తీరుతెన్నులపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం రోడ్లు ఎలా ఉన్నాయి? ఎలా ఉంటే బాగుంటుంది? భవిష్యత్‌లో మెరుగైన రహదార్ల వ్యవస్థ కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలేమిటి? జాతీయ రహదారులుగా మార్చాలిన రూట్లేవి? కేంద్ర పథకాల ద్వారా నిర్మించాల్సిన రోడ్లు ఎక్కడ ఉన్నాయి? ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా రహదారులు ఎలా నిర్మించాలి? అనే అంశాలపై లోతైన అధ్యయనం చేసి, భవిష్యత్‌కు ఉపయోగపడే విజన్ డాక్యుమెంట్‌ను సిద్ధం చేయాలని చెప్పారు. అన్నిటికంటే మనిషి ప్రాణాలు విలువైనవి కాబట్టి ప్రమాదరహిత ప్రయాణానికి అనుగుణంగా రోడ్ల వ్యవస్థను తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో రహదారుల నిర్మాణం, నిర్వహణకు అవలంబించే విధానం యావత్ దేశానికి ఆదర్శంగా నిలువాలని ఆయన సూచించారు. హైదరాబాద్ చుట్టూ ఔటర్‌కు అవతల 330 కిలోమీటర్ల పొడవున ప్రాంతీయ రింగురోడ్డు నిర్మాణానికి సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

### ప్రమాదాల నివారణకు సీఎం సూచనలు

- మూలమలుపులు తగ్గించే విధంగా రోడ్లను పునర్నిర్మించాలి.
- పట్టణాలు, గ్రామాల మీదుగా రోడ్డు వెళ్లకుండా బైపాస్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి.



**రోడ్ల నాణ్యతతోనే రవాణా వ్యవస్థ మెరుగుదల**

రాష్ట్రంలో రవాణా వ్యవస్థ మెరుగుదల రోడ్ల నాణ్యతపైనే ఆధారపడి ఉందని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. ఎక్కడ ఎలాంటి రహదారుల నిర్మాణం అవసరమో గుర్తించి, దానికి అనుగుణంగా నిర్మాణాలు

(మిగతా 2వ పేజీలో)

# ప్రమాదరహిత రోడ్లు

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టాలని సూచించారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి, మరమ్మతులకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చామని, అన్ని ప్రాంతాలను సమాన దృష్టితో చూస్తూ అవసరం ఉన్న చోట నిర్మాణాలు చేపడుతున్నామని సీఎం చెప్పారు.



మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఆర్అండ్‌బీశాఖపై సమీక్ష నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, లక్ష్మారెడ్డి, ముఖ్యకార్యదర్శులు నర్సింగరావు, సునీల్ శర్మ, ఈఎన్‌సీలు రవీందర్‌రావు, గణపతి

**నూతన జిల్లాలన్నిటికీ జాతీయ రహదారులతో కనెక్టివిటీ**

రాష్ట్రంలోని మొత్తం 31 జిల్లాలకు జాతీయ రహదారులతో అనుసంధానం ఉండేలా ముందుకు సాగాలని సీఎం కేసీఆర్ సూచించారు. కేంద్రప్రభుత్వం నుంచి 2500 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులను మంజూరు చేయించుకున్నామని చెప్పారు. జాతీయ రహదారులతోపాటు కేంద్ర ప్రభుత్వ పథకాలతో నిర్మించే రహదారులు, రాష్ట్ర పరిధిలోని రహదారులన్నిటినీ పరిగణనలోకి తీసుకుని దానికి అనుగుణంగా విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేయాలని సూచించారు.

**బైపాస్‌లకు ప్రాధాన్యం**

రోడ్డు ప్రమాదాలవల్ల నిత్యం అనేకమంది చనిపోవడం కలిచివేస్తున్నదని సీఎం చెప్పారు. మూల మలుపులు తగ్గించి రోడ్డును నేరుగా పునర్నిర్మించాలని సూచించారు. జాతీయ, రాష్ట్ర రహదారులు పట్టణాలు, గ్రామాల మీదుగా వెళ్లకుండా బైపాస్‌లకు ప్రాధాన్యం ఇచ్చి నిర్మించాలని సూచించారు. ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని చెప్పారు. జాతీయ రహదారులుగా బదిలీ అయిన రాష్ట్ర రహదారుల నిర్వహణ పనులు కూడా ఆర్అండ్‌బీ శాఖ చేపట్టాలని, జాతీయ రహదారుల నిర్మాణం జరిగే వరకు బాధ్యత తీసుకుని వెంటవెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు.

**రీజినల్ రింగ్‌రోడ్డు**

హైదరాబాద్ చుట్టూ ఔటర్ రింగ్‌రోడ్డు అవతలి నుంచి 330 కిలోమీటర్ల మేర ప్రాంతీయ రింగురోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. రెండేండ్లలో వీటి పనులు పూర్తి కావాలని, దీనికి కావాల్సిన కార్యాచరణ రూపొందించాలని సీఎం చెప్పారు. డీపీఆర్‌లు సిద్ధం చేయడానికి ఎక్కువ సమయం తీసుకుంటున్నారని, అవసరమైతే పనిని ఎక్కువ ప్యాకేజీలుగా విభజించి తక్కువ సమయంలో డీపీఆర్‌లు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. డీపీఆర్‌లు సిద్ధమైన వెంటనే భూసేకరణ జరిపి నిర్మాణం ప్రారంభించాలన్నారు.

**రోడ్ల మన్నికపై దృష్టి**

రహదారులు నిర్మించడమే కాకుండా వాటి నాణ్యతకు ప్రాధాన్యమిచ్చి ఎక్కువకాలం మన్నేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. వర్షం వస్తే రోడ్లు పాడయ్యే ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. రోడ్లు త్వరగా చెడిపోకుండా ఉండేందుకు విదేశాల్లో అనుసరిస్తున్న ఆధునిక పద్ధతులను అధ్యయనం చేసి అమలు చేయాలన్నారు. యూరప్, అమెరికా దేశాల్లో రోడ్లు బాగుంటాయని, అక్కడ రోడ్లు ఎలా వేస్తున్నారో తెలుసుకోవాలని చెప్పారు. రోడ్ల పక్కన పిచ్చి మొక్కలు తొలగించి ఎప్పటికప్పుడు సైడ్ బర్మ్స్ నిర్మించాలని చెప్పారు.

**ఆర్వోబీలపై ప్రతిపాదనలు**

జాతీయ, రాష్ట్ర రహదారుల వెంట ఎక్కడెక్కడ ఆర్వోబీలు, ఆర్‌యూబీలు, నదులు, కాల్వలపై వంతెనలు, కాజ్‌వేలు నిర్మించాలో గుర్తించి, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, దశలవారీగా వాటిని నిర్మించుకునేందుకు విజన్ డాక్యుమెంట్‌లో పొందుపర్చాలని సీఎం ఆదేశించారు. జాతీయ రహదారుల వెంట అవసరమైన చోట ఐలాండ్స్ నిర్మించి, వాటిని చక్కగా నిర్వహించాలని చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, రోడ్లు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి, సీఎం కార్యాలయ ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు, ఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్‌శర్మ, ఆర్అండ్‌బీ ఈఎన్‌సీలు గణపతిరెడ్డి, రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.